




నగర శివారులోని జీఆర్‌సీ కన్వెన్షన్‌లో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేంద్ర రెడ్డి కుమార్తె డాక్టర్ కె.చతుర, డాక్టర్ జి.నిఖిల్ దంపతుల వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, శిల్పా చక్రపాణి రెడ్డి, కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, సిట్రా సత్యనారాయణమ్మ, ఎస్వీ విజయ మనోహరి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పరీక్ష కేంద్రం తనిఖీ



కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ డీవీఆర్ సాయిగోపాల్

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కాలేజీల్లో జరుగుతున్న ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష కేంద్రాన్ని వర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ బుధవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలోని కేంద్రాన్ని తనిఖీ చేసిన వీసీ ఎలాంటి మాల్ ప్రాక్టిస్, కాపీయింగ్ లేకుండా చూడాలని కాలేజీ అధ్యాపకులకు సూచించారు. పరీక్షల నిర్వహణపై ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ పోటీల్లో క్రీడాకారులు రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా జట్టు ఎంపిక కార్యక్రమంలో ఆయన పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హ్యాండ్‌బాల్ క్రీడాంశంలో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లాకు మంచి పేరు ఉందన్నారు. అంతకుమించి కొనసాగేందుకు క్రీడాకారులు శ్రమించాలన్నారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సువర్ణ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: కర్నూలు సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రం బ్రహ్మోత్సవాల పోస్టర్లను బుధవారం ఆలయంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆవిష్కరించారు. కర్నూలు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు నిర్వహించే 19వ వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం నాయకులు దుర్గాప్రసాద్, సండేల్ చంద్రశేఖర్, ప్రసాద్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియాలో వసతుల కల్పనకు చర్యలు



వసతుల కల్పనను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): స్థానిక పాతబస్తీలోని ఉస్మానియా కళాశాల మైదానంలో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. బుధవారం స్థానిక కార్పొరేటర్లు షేక్ యూనసుబాషా, జుబేర్‌తో కలిసి కమిషనర్ మైదానాన్ని పరిశీలించారు. ప్రజల సౌకర్యార్థం మైదానంలో స్వచ్ఛత పనులు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్లు కమిషనర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కమిషనర్ స్వచ్ఛత పనులు వెంటనే ప్రారంభిస్తామని, వసతుల కల్పనకు ప్రతిపాదనలు తయారు చేయించి త్వరలో పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

ఆర్‌యూలో గొడవ

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో బుధవారం రాత్రి హాస్టల్ ఉద్యోగికి, విద్యార్థులకు మధ్య గొడవ జరిగింది. గదుల కేటాయింపు, ఇతర విషయాలపై ఉద్యోగి విద్యార్థుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. విషయం పోలీసులకు తెలియడంతో వారు వర్సిటీలోకి వచ్చి సర్ది చెప్పారు. బయటి నుంచి వచ్చిన విద్యార్థులను పంపించేశారు. గొడవ జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని గురువారం విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వర్సిటీ అధికారులు పేర్కొన్నారు.

ఆక్రమణలను అరికట్టండి

- ఫీల్డ్ అసిస్టెంట్లు లేకుంటే ఉపాధి పనుల్లో పురోగతి ఎలా సాధిస్తారు?
- 'పల్లె పండుగ' రోడ్లను సంక్రాంతిలోపు పూర్తి చేయాలి
- ఎంఎస్ఎంఈ సర్వేను వేగవంతం చేయండి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా



హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలకు సంబంధించిన ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీల ఆస్తుల పరిరక్షణపై జిల్లాస్థాయి సమావేశం, ఉపాధి హామీ పథకం అమలు, పల్లె పండుగ–రోడ్లు, ఎంఎస్ఎంఈ సర్వే పురోగతిపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2011లో ఇచ్చిన జీఓ ప్రకారం పంచాయతీల ఆస్తులకు సంబంధించిన ఇన్వెంటరీ రిజిస్టర్లను డీఎల్‌పీఓలు కచ్చితంగా నిర్వహించాలన్నారు. రిజిస్టర్లు నిర్వహిస్తున్నామని, వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉందని డీఎల్‌పీఓలు చెప్పగా రెండు వారాల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీకి పంచాయతీ ఆస్తులపై పూర్తిగా అవగాహన ఉండాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. భూములను కాపాడాల్సిన బాధ్యత తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలపై ఉంటుందన్నారు. ఎక్కడైనా ఆక్రమణకు గురై ఉంటే పోలీసు సహకారంతో తొలగించాలని ఆదేశించారు. గ్రామాల్లో శ్మశానాలు, ఇరిగేషన్ భూములు కూడా ఆక్రమణకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి పనుల పురోగతిపై అసంతృప్తి

జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు, పురోగతి తక్కువగా ఉందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇప్పటికే 90 శాతం లక్ష్యాన్ని సాధించాల్సి ఉన్నా ఆశించిన మేరకు ఫలితాలు రావడం లేదన్నారు. మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉంటే పురోగతి ఎలా సాధిస్తారని ప్రశ్నించారు. ఆదోని, కోసిగి, కౌతాళం, పెద్దకడబూరు, ఆలూరు, కృష్ణగిరి, దేవనకొండ, తుగ్గలి మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయని ఎంపీడీఓలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అనదపు పీడీ ఆదేశించారు. వారంలోపు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోతే ఎంపీడీఓలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీలో సిబెళగల్ మండలంలో 84 శాతం పురోగతి సాధించగా ఎమ్మిగనూరు, నందవరం, గోనెగొండ్ల, వెల్దుర్తి, ఓర్వకల్, కౌతాళం మండలాల్లో 60 శాతం మాత్రమే పురోగతి సాధించడంపై ఎంపీడీఓలను ప్రశ్నించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి పనుల కల్పనలో వెనకబడిన చివరి ఐదు మండలాల ఎంపీడీఓలను ప్రతి శనివారం పిలిపించి వివరణ అడుగుతామన్నారు. పల్లె పండుగలో భాగంగా 830 పనులు మంజూరు కాగా, అందులో ఇప్పటివరకు 581 పనులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. ఇందులో మంత్రాలయం, ఆలూరు, పెద్దకడబూరు, కోసిగి, కౌతాళం, చిప్పగిరి, కోడుమూరు, ఆస్పరి మండలాల్లో జరిగే పనుల్లో పురోగతి లేదని, సంక్రాంతిలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.హుస్సేన్‌పీరా, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, పీఆర్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, గనుల శాఖ అధికారి రవిచంద్, డీపీఓ భాస్కర్, జలవనరుల శాఖ ఈ.బాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: అభివృద్ధి పనులలో భాగంగా గురువారం నగరంలోని ఎన్ఆర్ పేట, సంకల్‌బాగ్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

21న సామూహిక భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: వేంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ ఉదయం విద్యార్థులచే సామూహిక భగవద్గీత పారాయణం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు నాగమల్లేశ్వరి తెలిపారు. సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి సహకారంతో 155 మంది విద్యార్థులతో భగవద్గీత పారాయణం ఉంటుందని పేర్కొన్నారు. భగవద్గీతలోని ఒకటవ అధ్యాయం అర్జున విషాదయోగంలోని 1 నుంచి 47 శ్లోకాలు సామూహికంగా పారాయణం చేస్తారని తెలిపారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, సనాతన ధర్మ పరిరక్షకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

22న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 22న జిల్లాస్థాయి జూనియర్స్ విభాగంలో బాలబాలికలకు కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2006 సంవత్సరం జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, 10వ తరగతి మార్కుల మెమో జిరాక్స్ తీసుకురావాలని తెలిపారు. ప్రతిభ చాటి ఎంపికైన క్రీడాకారులు వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్స్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

ఐసీడీఎస్ ఏపీడీగా నిర్మల

కర్నూలు న్యూసిటీ: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఏపీడీగా నిర్మల నియమితులయ్యారు. నంద్యాల సీడీపీఓగా ఉన్న ఆమెకు పదోన్నతి కల్పించి జిల్లా ఏపీడీగా బదిలీ చేశారు. గతంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐసీడీఎస్‌కు ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టు ఉండేది. అయితే జిల్లాల విభజన తర్వాత ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టు నంద్యాల జిల్లాకు కేటాయించారు. జిల్లాకు అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టును కేటాయించారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఏపీడీగా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ ఉన్నారు. ఒకటి రెండు రోజుల్లో కొత్త ఏపీడీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

చలికాలంలో జాగ్రత్తలు పాటించాలి



వృద్ధులకు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): శీతల గాలులు ఎక్కువగా వీస్తున్న తరుణంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చెప్పారు. ఆయన బుధవారం స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని తన క్లినిక్‌లో పేదలు, వృద్ధులకు స్వెట్టర్లు, మఫ్లర్లు, మంకీక్యాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చలితీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వృద్ధులకు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. వృద్ధులు, చిన్నపిల్లలు చలిగాలుల నుంచి రక్షణ పొందేందుకు ఉదయం 10.30 గంటల తర్వాతే బయటకు రావాలని, స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు ధరించాలని సూచించారు. చలికాలంలో తెల్లవారుజామున గుండెపోటు వచ్చే అవకాశం ఉంటుందని, చలి ప్రభావానికి గురైతే కొంతమందిలో రక్తనాళాలు సంకోచించి సరఫరా తగ్గిపోయి వేళ్లు, కాలిభాగాలు నల్లగా మారే అవకాశం ఉందన్నారు. కొంత మందిలో గ్యాంగ్రిన్, వెరికోసిస్ వంటి సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. మధుమేహ వ్యాధితో బాధపడేవారికి వివిధ రకాల సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు.

ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటాలి



క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేసిన క్లస్టర్ వర్సిటీ వీసీ సాయిగోపాల్

కర్నూలు (టౌన్): కేరళ రాష్ట్రంలోని కాలికట్ యూనివర్సిటీలో ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటాలని క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.సాయిగోపాల్ సూచించారు. బుధవారం యూనివర్సిటీ ప్రాంగణంలో ఫుట్‌బాల్ జట్టుకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుంటున్న సమయంలో స్పోర్ట్స్‌పై దృష్టి పెడితే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ సీనియర్ క్రీడాకారుడు విజయ్‌కుమార్, జట్టు మేనేజర్ ఫణీ నిఖిల్ హర్ష, యూనివర్సిటీ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డాక్టర్ బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.


టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): సమయానుసారంగా చిన్నారులు, గర్భిణులకు టీకాలు వేయించడం వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించవచ్చని డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. బుధవారం స్థానిక శ్రీరామనగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని 78, 79వ సచివాలయాల్లో గర్భిణులు, బాలింతలకు వ్యాధినిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. అప్పుడే జన్మించిన బిడ్డ నుంచి 16 ఏళ్ల చిన్నారులకు టీకాలు వేయడం వల్ల 12 రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందని చెప్పారు. తల్లులు పిల్లలకు నిర్దేశించిన ప్రకారం తప్పకుండా టీకాలు వేయిస్తే వ్యాధినిరోధక శక్తి పెరిగి ఎలాంటి వైరస్‌లకు గురికాకుండా ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. ఆరోగ్య కేంద్రం, సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని రకాల టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, సచివాలయ ఉద్యోగులు పద్మావతి, రామలక్ష్మి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి కుర్చీల వితరణ



ఫోరెన్సిక్ విభాగానికి కుర్చీలు వితరణ చేసిన విష్ణుసేన నాయకులు

కర్నూలు(హాస్పిటల్): విష్ణుసేన ఆర్గనైజేషన్ వారు కర్నూలు మెడికల్ కాలేజీలోని ఫోరెన్సిక్ విభాగానికి 20 కుర్చీలు, రెండు ఆఫీస్ టేబుళ్లు వితరణ చేశారు. వీటిని బుధవారం ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ డాక్టర్ సాయి సుధీర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా విష్ణుసేన నాయకులు మాట్లాడుతూ.. తమ ఆర్గనైజేషన్ సమాజ సేవలో ముందుంటుందని, అవకాశం ఉన్న మేరకు వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫోరెన్సిక్ వైద్యులు నాగార్జున, హరీష్, సాహిల్, ల్యాబ్‌టెక్నీషియన్ వేణు, విష్ణుసేన నాయకులు రసూల్, రామాంజనేయులు, ఇ.తాండ్రపాడు తెలుగు శేషన్న తదితరులు పాల్గొన్నారు.

22న ఉమ్మడి జిల్లా కళాకారుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లా కళాకారుల సమ్మేళనాన్ని ఈ నెల 22వ తేదీ నిర్వహించనున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. బుధవారం సీక్యాంప్‌లోని కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. కళాక్షేత్రంలో మధ్యాహ్నం 3 గంటలకు సమ్మేళనం ఉంటుందన్నారు. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ చేపట్టిన జిల్లాల పర్యటన కర్నూలు జిల్లా నుంచి ప్రారంభమవుతుందన్నారు. అందులో భాగంగా మొదటి సారి కర్నూలుకు వస్తున్నారన్నారు. కళాకారులు తమ సమస్యలనూ చైర్మన్ దృష్టికి తీసుకొస్తే ఆయన ప్రభుత్వానికి నివేదిస్తారన్నారు. కళాకారుల పెన్షన్లు, ఇళ్ల స్థలాలు వంటి సమస్యలపై గోపాల కృష్ణ మాట్లాడతారన్నారు.

అదే రోజు సాయంత్రం 6 గంటలకు 'జగదేక సుందరి సామ పద్య నాటక ప్రదర్శన' ఉంటుందని తెలిపారు. ఇటీవల దివంగతులైన ప్రముఖ నాటక రచయిత పల్లేటి కుల శేఖర్‌కు ఈ నాటకాన్ని అంకితం చేస్తున్నట్లు చెప్పారు. సినిమాను తలపించేలా ఎల్ఈడీ స్క్రీన్ సహాయంతో పౌరాణిక నాటకంలో నూతన విధానంలో ప్రేక్షకులను ఆకర్షించేలా ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం వివిధ రంగాల్లో నిష్ణాతులైన కళాకారులకు సన్మానం ఉంటుందన్నారు. సమావేశంలో కళాక్షేత్రంలో ఉపాధ్యక్షులు సీవీ రెడ్డి, కార్యదర్శి మహమ్మద్ మియ్యా పాల్గొన్నారు.

పన్ను చెల్లింపులో జాప్యం చేయొద్దు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన అద్దె, పన్నుల్లో జాప్యం చేయవద్దని అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ సూచించారు. బుధవారం స్థానిక సి.క్యాంపు రైతుబజార్ వద్ద ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను అదనపు కమిషనర్ పరిశీలించారు. పన్ను బకాయిలపై ఆరా తీశారు. వంద శాతం పన్నులు చెల్లించాలని సూచించారు. దుకాణాదారులు షాపింగ్ కాంప్లెక్స్‌లోని సమస్యలు వివరించారు. స్పందించిన అదనపు కమిషనర్ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే శ్రీప్రియనగర్, రామ్‌నగర్, అన్నయ్యనగర్ ప్రాంతాల్లో వీఎల్‌టీ దర ఖాస్తులను పరిశీలించారు. రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజు, భార్గవ్ పాల్గొన్నారు.

నర్సుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం నాయకులు బుధవారం సాయంత్రం వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లో ప్రస్తుతం ఇద్దరు మాత్రమే స్టాఫ్ నర్సులు ఉన్నారని, దీనివల్ల వారిపై పనిభారం పెరుగుతోందన్నారు. ఇద్దరి స్థానంలో నలుగురిని నియమించాలని కోరారు. అలాగే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నర్సెస్ అసోసియేషన్ రూమ్‌కు మరమ్మతులు చేయాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శాంతి భవాని, జిల్లా అధ్యక్షురాలు లీలావతి, సెక్రటరీ భంగారి, తదితరులు ఉన్నారు.

22 వరకు పత్తి కొనుగోళ్లు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిర్వహిస్తున్న పెంచికలపాడు పత్తి కొనుగోలు కేంద్రంలో ఈనెల 22 వరకు పత్తి కొనుగోళ్లు బంద్ చేసినట్లుగా జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి తెలిపారు. గూడూరు మండలం పెంచికలపాడులోని మంజిత్ కాటన్‌మిల్‌లో మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేస్తున్నారు. మిల్లులోని యంత్రాల్లో సాంకేతిక సమస్యలు ఏర్పడినందున ఈ నెల 22వ తేదీ వరకు పత్తి కొనుగోళ్లు నిలిపి వేసినట్లు బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 23వ తేదీ నుంచి మద్దతు ధరతో కొనుగోళ్లు జరుగుతాయని, కొత్త టోకెన్‌ల కోసం రైతులు ఆ రోజున కొనుగోలు కేంద్రానికి రావాలని సూచించారు. ఇది వరకే టోకెన్‌లు బుక్ చేసుకున్న రైతులు కొత్త షెడ్యూలు ప్రకారం పత్తి తీసుకరావాలని తెలిపారు. 19న రావాల్సిన రైతులు 23న, 20 నాటి రైతులు 24న, 21 నాటి రైతులు 26న, 23 నాటి రైతులు 27న, 24 నాటి రైతులు 28న, 26 నాటి రైతులు 30న, 27 నాటి రైతులు 31న కొనుగోలు కేంద్రానికి పత్తి తీసుక రావాలని సూచించారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

పని సర్దుబాటు సరైంది కాదు

కర్నూలు సిటీ: ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరాముడు, గట్టు తిమ్మప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఒకసారి పని సర్దుబాటు చేశారని, మరోసారి విద్యా సంవత్సరం మధ్యలో చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం మంచిది కాదన్నారు. ఈ నిర్ణయం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అసౌకర్యంగా ఉంటుందన్నారు. స్కూళ్లలో టీచర్లు నిర్దేశిత అకడమిక్ క్యాలెండర్‌కు అలవాటు పడి ఉంటారని, విద్యాశాఖ నిర్ణయం తీసుకునే ముందు పని సర్దుబాటుపై ఉపాధ్యాయుల అభిప్రాయాలను తీసుకోవాల్సిందని అన్నారు. వెంటనే విద్యాశాఖ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యూపీహెచ్‌సీలో రీజనల్ డైరెక్టర్ తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీని బుధవారం ప్రాంతీయ ఆరోగ్య అధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి ఓపీ, ల్యాబ్, మందుల గదికి సంబంధించిన రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్‌సీడీ 3.0 సర్వేలో భాగంగా ఏఎన్ఎంలు, ఆశాలు ఒక బృందంగా వెళ్లి రోజుకు ఐదు గృహాలను సందర్శించి ఆ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అనుమానిత కేసులను వైద్యాధికారిచే నిర్ధారించి తగిన చికిత్సలు అందించాలని చెప్పారు. ఓపీ కోసం వచ్చిన వారికి ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు ద్వారా అభా ఐడీ జనరేట్ చేసి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందించాలని తెలిపారు. ఆ వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, సరిపడా వ్యాధినిర్ధారణ కిట్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట డీపీఓ విజయరాజు, యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది జయమ్మ, వీరభద్రయ్య, షబీహాబేగం ఉన్నారు.

ఘనంగా క్యాండిల్ లైటింగ్ సర్వీసు

కర్నూలు (టౌన్): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి స్థానిక ఆర్ఎస్ రోడ్డులోని రాక్‌వుడ్ చర్చిలో ఘనంగా క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. రాయలసీమ డయాసిస్ బిషప్ డాక్టర్ బి.డి.ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిషప్ దైవ సందేశమిస్తూ యేసుక్రీస్తు దైవత్వాన్ని విడిచి మానవ రూపంలో జన్మించి మానవాళికి ప్రేమ మార్గాన్ని బోధించారన్నారు. కార్యక్రమంలో కోయర్ డైరెక్టర్స్ డాక్టర్ సుప్రియ, శామ్యూల్ సంగీత సారథ్యంలో క్వయర్ బృందం మధుర భక్తి గీతాలు ఆలపించారు. క్రిస్మస్ కమిటీ చైర్మన్ ఆనందరావు, వైస్ చైర్మన్ బెంజిమిన్ రాజు, కోశాధికారి స్వరూప్ సిన్హా, కార్యవర్గ సభ్యులు మనోహర్, పాస్టర్లు, చర్చి పెద్దలు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

నా కక్షిదారులైన (1) ఇస్కాల శ్రీనివాసులు తండ్రి ఇస్కాల సుబ్బయ్య, ఇంటి నెం. 52/84బి, ఫోర్ట్, కర్నూలు (2) ఇస్కాల మురళి తండ్రి ఇస్కాల సుబ్బయ్య, ఫ్లాట్ నెం. 501, వి.సి.రెసిడెన్సీ, శ్రీనివాస నగర్, కర్నూలు, సూచనల మేరకు ఇచ్చిన జనరల్ నోటీసు ఏమనగా

క్రింద కనబరచిన షెడ్యూలు దాఖలా ఇంటి స్థలము నా కక్షిదారులకు చెంది వారి స్వాధీనానుభవములో వున్నది. కానీ (1) బి.సి. భీమేష్ తండ్రి బి.సి. చిన్న లింగన్న, ఇంటి నెం. 3-54, కప్పట్రాళ్ళ గ్రామము, దేవనకొండ మండలం, కర్నూలు జిల్లా (ఆధార్ కార్డ్ నెం. 4103 1070 0133) (2) మేకల సాయి కుమార్ తండ్రి యం.శ్రీనివాసులు, ఇంటి నెం. 51-15-ఎ-18-5, రాజీవ్ నగర్, కర్నూలు సిటీ, (ఆధార్ కార్డ్ నెం. 5626 6090 6735) అను వారు షెడ్యూలులో కనపరచిన స్థలముపై ఎలాంటి హక్కులు లేకున్ననూ తప్పుడు సర్వే నెంబరు (కల్లూరు గ్రామ సర్వే నెం. 330) మరియు తప్పుడు వివరములతో విక్రయించుటకు ప్రయత్నము చేయుచున్నారని తెలిసినది.

సదరు షెడ్యూలు స్థలమును ఎవరైనా కొనుగోలు చేసిననూ వారికి ఎలాంటి హక్కులు సంక్రమించవని, సివిల్ మరియు క్రిమినల్ కేసులు ఎదుర్కొనవలసి వున్నదని తెలియజేయడమైనది.

షెడ్యూలు: కల్లూరు గ్రామ సర్వే నెం. 329/1 లోని స్థలము వివరములు. **విస్తీర్ణం: 4230 చ.అడుగులు, కొలతలు:** ఉత్తరము మరియు దక్షిణము దిక్కులలో తూర్పు-పడమర = 90 అడుగులు, తూర్పు మరియు పడమర దిక్కులలో ఉత్తరము-దక్షిణము = 47 అడుగులు.

ప్రస్తుత సరిహద్దులు (చెక్కుబంది) :

తూర్పు: ఇదే సర్వే నెంబరులోని స్థలము, **పడమర:** 30 అడుగుల వెడల్పు గల రోడ్డు, **ఉత్తరము:** గోపి గారి భార్గవ అపార్టుమెంట్ భవనము, **దక్షిణము :** 40 అడుగుల వెడల్పు గల రోడ్డు.

పి.వి.సుధాకర్ రెడ్డి, అడ్వకేట్, కర్నూలు. సెల్: 93938 33155.